
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్
5
గురువారం 11 డిసెంబరు 2025
జిల్లాల వార్తలు



గ్రామాలు మూరెడు.. అభ్యర్థులు బారెడు
వందల్లోనే ఓటర్లు.. నలుగురైదుగురు పోటీ!
7
సర్పంచ్ అభ్యర్థికి నీ ఇష్టం కానీ..
వార్డులో నాకే ఓటేయండి!
సర్పంచు అభ్యర్థుల డబ్బులతోనే పోటీచేసి వెన్నుపోటు!



సంగారెడ్డిలో పోలింగ్ కేంద్రాలకు తరలిన ఎన్నికల సిబ్బంది



మెదక్‌లో పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు బస్ కోసం ఎదురుచూస్తున్న సిబ్బంది

విజేతలెవరో..?

● నేడు తొలివిడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ ● సాయంత్రానికి ఫలితాలు వెల్లడి

ఏడేళ్ల అనంతరం నిర్వహిస్తున్న పంచాయతీ ఎన్నికల తొలి విడత పోలింగ్‌కు సమయం ఆసన్నమైంది. నేటి ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఓటింగ్, అనంతరం ఓట్ల లెక్కింపు జరగనుంది. సిద్దిపేట జిల్లాలోని 163 గ్రామాలు, 1,432 వార్డులు, సంగారెడ్డి జిల్లాలోని 136 గ్రామాలు, 1,246 వార్డులు, మెదక్ జిల్లాలోని 160 గ్రామాలు, 1,402 వార్డుల్లో నేడు తొలివిడత ఎన్నికలు జరగనున్నాయి. ఇదే రోజు సాయంత్రం వరకు విజేతలెవరో తేలనున్నది. గెలిచే సర్పంచ్‌లు, వార్డు సభ్యులు ఎవరనే విషయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. పది రోజులు హోరాహోరీగా సాగిన ప్రచారంలో అభ్యర్థులు తీవ్రంగా శ్రమించారు. ఆఖరి ప్రయత్నంగా కొన్నిచోట్ల పంపకాలు సైతం చేపట్టారు.

-సంగారెడ్డి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

మేజర్ గ్రామ పంచాయతీల్లో పోటాపోటీ

ముఖ్య నేతల సొంతూళ్లలోనూ ప్రతిష్టాత్మకం

మున్సిపాలిటీల శివారు పల్లెల్లో పంపకాల జోరు

తొలివిడత ఎన్నికలు జరగనున్న సిద్దిపేట జిల్లా వర్గల్, ములుగు, మర్కుక్, జగదేవ్‌పూర్, రాయపోల్, దౌల్తాబాద్ మండల కేంద్రాలతోపాటు గౌరారం, తీగుల్ నర్సాపూర్ తదితర గ్రామాల్లో పోటీ తీవ్రంగా ఉంది. మెదక్ జిల్లా పెద్దశంకరంపేట, అల్లాదుర్గం, హవేళిఘన్‌పూర్, రేగోడ్, టేక్మాల్, పాపన్నపేట మండల కేంద్రాలు సహా పలు గ్రామాల్లో నువ్వా నేనా అంటూ పోటీపడుతున్నారు. సంగారెడ్డి జిల్లా కంది, కొండాపూర్, హత్నూర మండల కేంద్రంతోపాటు మల్కాపూర్, మల్లేపల్లి, చేర్యాల, చిమ్నాపూర్, ఇస్మాయిల్‌ఖాన్‌పేట, తాళ్లపల్లి, పెద్దాపూర్ తదితర గ్రామాల్లో అభ్యర్థులు గెలుపు కోసం పోటాపోటీగా శ్రమిస్తున్నారు.

ఆ మూడు గ్రామాల్లో జోష్

పటాన్‌చెరు మండలంలో జీహెచ్‌ఎంసీలో కలవకుండా మిగిలిన భానూరు, నందిగామ, క్యాసారం గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల జోష్ సంతరించుకుంది. ఈ గ్రామాలను గ్రేటర్ హైదరాబాద్‌లోనే విలీనం చేయాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ బీడీఎల్ పరిశ్రమ ఉన్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలుగానే ఉంచి, మండల పరిషత్ ఏర్పాటు చేశారు. ఇక్కడ సర్పంచ్, వార్డు అభ్యర్థులుగా బరిలోకి దిగినవారంతా రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఒక్కో ఓటుకు రూ.10వేలకు పైగానే ధర పలుకుతున్నట్లు సమాచారం. వారం రోజులుగా నిత్యం మద్యం, మటన్, చికెన్‌తో విందులు

మిగతా 8వ పేజీలో





సంగారెడ్డిలో పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రంలో ఎన్నికల సిబ్బంది

మెదక్‌లో 144 సర్పంచ్, 1068 వార్డు స్థానాలు..

మెదక్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో మొదటి విడతలో అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్, పెద్ద శంకరంపేట, పాపన్నపేట, హవేళీఘనపూర్ మండలాల పరిధిలోని 144 సర్పంచ్, 1,068 వార్డు స్థానాలకు గురువారం పోలింగ్ జరగనుంది. ఈ మండలాల్లో 16 సర్పంచు, 332 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన స్థానాలకు నేడు పోలింగ్ నిర్వహించనున్నారు. సర్పంచ్ బరిలో 411 మంది, వార్డులకు పోటీలో 2,426 మంది ఉన్నారు. 1,74,356 మంది ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఆరు మండలాల్లో 1,292 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణకు 1,421 పీవోలు, 1,529 ఓపీవోలు, 155 రిటర్నింగ్ అధికారులను నియమించారు.

సంగారెడ్డి జిల్లాలో 136 సర్పంచ్‌లు, 1,246 వార్డులు

1,246 వార్డులకు ఓటేయనున్న 1,98,669 మంది ఓటర్లు

సంగారెడ్డి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని 7 మండలాల్లో నేడు తొలి విడత ఎన్నికలు జరుగనున్నాయి. సంగారెడ్డి, కొండాపూర్, కంది, సదాశివపేట, గుమ్మడిదల, పటాన్‌చెరు, హత్నూర మండలాల పరిధిలోని 136 గ్రామ పంచాయతీలు, 1,246 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. 1,246 పోలింగ్ కేంద్రాలు, 1,276 బ్యాలెట్ బాక్సులను అందులో ఉంచారు. మొత్తం 1,98,669 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో 96,913 మంది పురుషులు, 1,01,624 మహిళలు, 32 మంది ఇతరులు ఉన్నారు.



అమీన్‌పూర్ జీహెచ్‌ఎంసీ కార్యాలయం

జీహెచ్‌ఎంసీ డివిజన్లు ఖరారు

రెండు డివిజన్లుగా అమీన్‌పూర్ పట్టణం

పటాన్‌చెరు/అమీన్‌పూర్/రామచంద్రాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు నియోజకవర్గంలో పురపాలక సంఘాలు జీహెచ్‌ఎంసీలో విలీనమైన నేపథ్యంలో డివిజన్ల విభజన ప్రక్రియ ముగిసింది. అమీన్‌పూర్ పురపాలక సంఘాన్ని అమీన్‌పూర్, సుల్తాన్‌పూర్ డివిజన్లుగా విభజించారు. ఐడీఏ బొల్లారం పురపాలికలో 36వేల మంది మాత్రమే ఓటర్లు ఉండటంతో ప్రత్యేక డివిజన్‌గా మార్చారు. తెల్లాపూర్ పురపాలకలో తెల్లాపూర్, ముత్తంగి డివిజన్లుగా రూపొందించారు. పటాన్‌చెరు డివిజన్ నుంచి జేపీకాలనీని విభజించి ప్రత్యేక డివిజన్ చేశారు. డివిజన్లన్నీ పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోనే ఉండాలన్న నిబంధన ప్రభుత్వం అమలు చేసింది. భారతీనగర్ డివిజన్‌లోని శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన 10 పోలింగ్‌బూత్‌ల పరిధిలోని 12వేల మంది ఓటర్లను తొలగించి తెల్లాపూర్ విద్యుత్‌నగర్‌లోని 12వేల మంది ఓటర్లను కలిపారు. మరోవైపు రామచంద్రాపురం డివిజన్ విషయంలో మాత్రం ఎటువంటి మార్పులు చేయలేదు.

లక్ష జనాభాకు రెండు వార్డులు

అమీన్‌పూర్ మున్సిపాలిటీని రెండు డివిజన్లుగా పునర్విభజించడం ప్రకంపనలు సృష్టిస్తోంది. లక్ష మంది ఓటర్లు ఉన్న పట్టణంలో కేవలం రెండు డివిజన్లనే ఏర్పాటు చేయడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. బీరంగూడ పరిధిలో 50వేల ఓటర్లు ఉండగా.. మొన్నటి వరకు గ్రామపంచాయతీగా ఉన్న సుల్తాన్‌పూర్ పేరిట డివిజన్‌ను ప్రతిపాదించడంపై పెదవి విరుస్తున్నారు. పాలనా సౌలభ్యం కోసం మరో డివిజన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ వార్డుల విభజనలో శాస్త్రీయత లోపించిందని పలు పార్టీల నాయకులు విమర్శించారు. బీజేపీ నాయకులు ఎడ్ల రమేష్, ఆదెల్లి రవీందర్ మాట్లాడుతూ ఓటర్లు ఎక్కువగా కేంద్రీకృతమై ఉన్న బీరంగూడ పేరిట డివిజన్ ఏర్పాటు చేయకపోవడం దురదష్టకరమన్నారు. అమీన్‌పూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ లక్ష ఓటర్లు ఉన్న అమీన్‌పూర్‌లో కనీసం మూడు డివిజన్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అమీన్‌పూర్, బీరంగూడ గ్రామాలను రెండుగా చీల్చి డివిజన్లను ఏర్పాటు చేయడం వల్ల ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. డివిజన్ల ఏర్పాటులో తమ అభ్యంతరాలను జీహెచ్‌ఎంసీ అధికారులకు తెలియజేస్తామని వారు పేర్కొన్నారు.

డివిజన్ 263గా తెల్లాపూర్

జీహెచ్‌ఎంసీలో విలీనమైన పురపాలికల పరిధిలోని తెల్లాపూర్, రామచంద్రాపురం మండలంలోని గ్రామాలను కలుపుతూ 263 నంబరు వార్డుగా ఏర్పాటు చేశారు. తూర్పున తెల్లాపూర్ గ్రామం అంబేద్కర్ కాలనీ (అభ్యాంజనేయ స్వామి ఆలయం) నుంచి ప్రారంభమై గ్రామ సరిహద్దులోని ఎస్‌బీఐ బ్యాంకు నుంచి నర్సరీ, హెచ్‌ఎండీ భూముల గుండా జ్యోతిరావు ఫులే కాలనీ నుంచి వాసుదేవ్, మైఫేర్ విల్లాస్, కస్తూర్బా పాఠశాల నుంచి సర్వే నంబరు 12 వద్ద ముగుస్తుంది. దక్షిణాన ఉస్మాన్‌నగర్ ఎస్‌కార్ ముప్ప గ్రెనడ్, అపార్ణ సైబర్ షైన్ నుంచి ఓఆర్‌ఆర్ దాటి కొల్లూరు గ్రామ సరిహద్దు, ఆర్‌ఆర్ కొల్లూరు కౌంటీ నైరుతి మూలలో ముగుస్తుంది. పశ్చిమాన ఆర్‌ఆర్ కొల్లూరు కౌంటీ నుంచి ఈదులనాగులపల్లి గ్రామ సరిహద్దుల నుంచి కొండకల్ రేడియల్ రోడ్డు 7, గ్రామ సరిహద్దు సర్వే నంబరు 314 వద్ద ముగుస్తుంది. ఉత్తర భాగంలో నాగులపల్లి సర్వే నంబరు 314 నుంచి ప్రారంభమై ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ 2ను దాటి రేడియల్ రోడ్డు 7 నుంచి ఎంఐజీ ఫేస్-2ను చుట్టేస్తుంది.

ఎన్నికల నిర్వహణకు సర్వం సద్ధం

సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి రూరల్/హత్నూర, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో మొదటి విడత పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. సంగారెడ్డి ఎంపీడీవో, హత్నూర మండల కేంద్రంలో పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీవో, ఓపీవోలకు పోలింగ్ సామగ్రి పంపిణీలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా పక్కాగా అందించాలని ఆదేశించారు. ఎన్నికల సిబ్బంది సమయానికి విధులకు హాజరుకాకపోతే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



సంగారెడ్డిలో పోలింగ్ సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

పటిష్ట బందోబస్తు : ఎస్పీ

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పలు సూచనలు చేశారు.

పోలింగ్‌బూత్‌లో వసతులు లేవని సిబ్బంది ఆందోళన

రేగోడు డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ బూత్‌లో సరైన సౌకర్యాలు లేవని ఎన్నికల సిబ్బంది ఆందోళన చేసిన ఘటన బుధవారం రాత్రి రేగోడులో జరిగింది. సౌకర్యాలు కల్పించాలంటూ ఎంపీడీవోను ప్రశ్నిస్తే డ్యూటీ చేసేందుకు వచ్చారా... ఎంజాయ్ చేసేందుకు వచ్చారా.. అంటూ సమాధానం ఇవ్వడంతో ఎంపీడీవో డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. డీపీవోకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. రేగోడు పోలింగ్ బూత్‌కు 45 మంది సిబ్బందిని కేటాయించారు. సరైన సౌకర్యాలు లేవని, బాత్రూంలు అపరిశుభ్రంగా ఉన్నాయని, రూముల్లో కార్పెట్లు కూడా లేవని, కనీసం టీ, భోజనం కూడా ఏర్పాటు చేయలేదని వారు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై పోచయ్య సిబ్బందితో మాట్లాడి సౌకర్యాలు కల్పిస్తామని నచ్చజెప్పారు. ఈ విషయంపై ఎంపీడీవో సీతరావమ్మను వివరణ కోరగా అన్ని సౌకర్యాలు ఉన్నా.. సిబ్బంది ఇలాగే ప్రవరిస్తారని చెప్పడం గమనార్హం.



రేగోడులో పోలింగ్ బూత్ వద్ద ఆందోళన చేస్తున్న సిబ్బంది

పోలింగ్ పక్కాగా : మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

పాపన్నపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మొదటి విడత పంచాయతీ ఎన్నికలు జాగ్రత్తగా నిర్వహించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన పాపన్నపేటలో మొదటి విడత ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఆయనవెంట జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంపీడీవో విష్ణువర్ధన్, తహసీల్దార్ సతీష్, ఎన్నికల అధికారుల, సిబ్బంది పాల్గొన్నారు.



పోలింగ్ సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు

పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, నిష్పాక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసుశాఖ అన్ని ఏర్పాట్లు చేసిందని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రతీ గ్రామంలో, ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. సిబ్బంది తమకు అప్పగించిన బాధ్యతలను పూర్తినిబద్ధతతో నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట సీఐలు రాజశేఖర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, శైలెందర్, సందీప్‌రెడ్డి, ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

అక్కడ బీఆర్‌ఎస్ పోటీలోనే లేదు



పుల్‌కల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఉమ్మడి పుల్కల్ మండలంలో విచిత్ర పరిస్థితి నెలకొన్నది. పలు పంచాయతీల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను పోటీకి నిలబెట్టలేదు. పెద్దారెడ్డిపేటలో బీఆర్‌ఎస్ నాయకులు... కాంగ్రెస్‌లోని ఒక వర్గానికి మద్దతు తెలుపుతున్నారు. ముదిమాణిక్యంలో బీఆర్‌ఎస్ మద్దతుదారు పోటీలో ఉన్నప్పటికీ ఆ పార్టీ సీనియర్ నాయకుడు... కాంగ్రెస్ నుంచి పోటీలో ఉన్న ఆ పార్టీ మండల అధ్యక్షుడికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మండల కేంద్రమైన పుల్కల్‌లో బీఆర్‌ఎస్, బీజేపీలు ఉమ్మడిగా అభ్యర్థిని ప్రకటించి ప్రచారం చేపడుతున్నారు. శివంపేట, కోర్పోలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు పోటీలో లేకపోవడంతో బీజేపీ, కాంగ్రెస్ మద్దతుదారులకు ప్రచారం చేస్తున్నారు. చౌటకూర్‌లో కాంగ్రెస్‌లోని ఓ వర్గం నాయకులు బీఆర్‌ఎస్ మద్దతుదారుడికి ప్రచారం చేపడుతున్నారు.

రెండు వార్డులకు అభ్యర్థులే లేరు!

పాపన్నపేట, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లలో గందరగోళంతో మెదక్ జిల్లా పాపన్నపేట మండలం అర్కెల పంచాయతీలో రెండు వార్డులకు అభ్యర్థులు లేక ఎన్నికలు జరగడం లేదు. అర్కెల పంచాయతీలోని 7, 9 వార్డులను ఎస్టీలకు రిజర్వ్ చేశారు. కానీ పంచాయతీ పరిధిలో ఒక్క ఎస్టీ ఓటరు కూడా లేకపోవడంతో అభ్యర్థులు లేక ఎన్నికలు నిలిచిపోయాయి. సర్పంచ్, మిగిలిన 8 వార్డులకు ఎన్నికను జరుగుతున్నాయి.

కోహీర్‌లో చలి @5.6 డిగ్రీలు

రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు

ఉమ్మడి జిల్లాలో 54 ప్రాంతాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు




కోహీర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో చలి రికార్డులు బద్దలు కొడుతోంది. రాష్ట్రంలోనే అత్యల్పంగా బుధవారం ఉదయం సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 5.4 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదయింది. ఉమ్మడి జిల్లాలో 54 ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మెదక్ జిల్లా శివ్వంపేటలో 7.8 డిగ్రీలు, సిద్దిపేట జిలా పోతిరెడ్డిపేటలో 7.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదయింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత వివరాలు..

సంగారెడ్డి జిల్లా: కోహీర్ 5.6, ఝరాసంఘం 6.3, అల్లోల్ 6.4, న్యాల్‌కల్ 6.9, జహీరాబాద్ 6.9, సత్వార్ 6.9, మల్‌చెల్మ 7, మొగుడంపల్లి 7.9, నిజాంపేట్ 8.1, నల్లవల్లి 8.1, పుల్కల్ 8.3, కడ్పల్ 8.3, సిర్గాపూర్ 8.9, దిగ్వాల్ 8.9, కంగ్టి 8.9, రాయికోడ్ 9, సదాశివపేట 9.1, పాశమైలారం 9.2, జిన్నారం 9.5, హత్నూర 9.5, గుండ్లమాచనూరు 9.6, కొండాపూర్ 9.6, కంది 9.9, కల్హేర్‌లో 10.2, అన్నాసాగర్ 10.3, చౌటకూర్ 10.5, రామచంద్రాపురం 10.5, పల్వట్ల 10.5 సంగారెడ్డి 10.6, అల్మాయిపేట్ 10.7, నాగల్‌గిద్ద 10.8, ముక్తాపూర్ 10.8, నారాయణఖేడ్ 10.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మెదక్ జిల్లా: దామరంచ 8, శివ్వంపేట 7.8, వెల్దుర్తి 8.6, కుల్చారం 8.6, సర్దన 8.8,

మిగతా 8వ పేజీలో









ప్రేక్షకుల కోరిక మేరకు క్రింది థియేటర్లలో మరలా ప్రదర్శించబడుతుంది



రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నంగునూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన నంగునూరులో చోటుచేసుకుంది. సిద్దిపేట అర్బన్ మండలం కిస్టసాగర్ గ్రామానికి చెందిన నర్ర సాయి భరత్ రెడ్డి (22) నంగునూర్‌లో ఆర్కే ఫుట్వేర్ షాపులో పనిచేస్తున్నాడు . పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై తిరిగి తన స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఎమ్మార్వో ఆఫీస్ చౌరస్తాలోని గల వివేకానంద స్వామి విగ్రహం వద్ద బైక్ ని అతివేగంగా నడుపుతూ అదుపుతప్పి కిందపడడంతో తలకు, ఛాతి భాగాలకు బలమైన గాయాలవడంతో స్థానికులు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి నర్ర మధుసూదన్ రెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజగోపాలపేట ఎస్సై వివేక్ తెలిపారు.









చెత్త ఏరుకోవడంలో అడ్డొస్తున్నాడని హత్య

తూప్రాన్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): చెత్త ఏరుకోవడంలో తనకు పోటీ వస్తున్నాడని ఓ యువకుడిని కిరాతకంగా హత్య చేశాడు. ఈ సంఘటన మంగళవారం రాత్రి మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని లింగారెడ్డిపేట ఆర్టీసీ బసాప్ వద్ద చోటు చేసుకుంది. తూప్రాన్ సీఐ రంగ కృష్ణ, ఎస్సై శివానందం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం ధర్మారావుపేటకు చెందిన ర్యాపని హన్మంతు (40) కొంతకాలంగా మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట శివారులో చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఓ కొన్ని రోజుటాగా యువకుడు హన్మంతు ఏరుకునే చోటనే ఏరుకుంటూ తనకు దొరక్కుండా చేస్తూ.. కొన్నింటిని దొంగలించేవాడు. ఈ విషయంలో ఎన్నిసార్లు చెప్పి మందలించినప్పటికీ వినలేదు. హన్మంతు పడుకుంటున్న అల్లాపూర్ శివారులో హైవే పక్కనే ఉన్న లింగారెడ్డిపేట బస్టాప్‌లో యువకుడు పడుకొని గురకపెడుతుండేవాడు. దాంతో నిద్రపట్టకపోవడంతో వెళ్లిపొమ్మంటు ఎన్నిసార్లు చెప్పినప్పటికీ ఆ యువకుడు వెళ్లకపోవడంతో చంపేస్తే అతడితో ఇబ్బంది తప్పుతుందని హన్మంతు భావించాడు. మద్యం మత్తులో ఉన్న యువకుడి కాళ్లు, చేతులు తాడుతో కట్టేసి కర్రతో తలపై కొట్టాడు. అయినా చనిపోకపోవడంతో మెడకు తాడుతో గట్టిగా బిగించి హత్య చేశాడు. మనోహరాబాద్ పోలీస్‌కానిస్టేబుళ్లు అనిల్‌కుమార్, ఉమేష్‌లకు హత్య గురించి తెలిసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడిని గుర్తిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఎక్స్‌కవేటర్‌ను ఢీ కొన్న బస్సు..

● 25 మంది కార్మికులకు గాయాలు


ప్రమాదానికి గురయిన బస్సు

పటాన్‌చెరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్మికులను తీసుకు వెళుతున్న బస్సు ఎక్స్‌కవేటర్‌ను ఢీకొని 25 మంది గాయపడిన సంఘటన సంగారెడ్డి జిల్లా బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాశమైలారం పారిశ్రామికవాడలోని కిర్బీ పరిశ్రమ మొదటి షిఫ్ట్‌లో పని చేసే కార్మికులను బుధవారం ఉదయం 5గంటల సమయంలో బస్సులో తీసుకెళ్తున్నారు. మార్గమధ్యంలో బీడీఎల్ కూడలిలో రోడ్డు పనులు చేసే ఎక్స్‌కవేటర్ రోడ్డు కింది భాగంలోకి వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన బస్సు ఢీకొట్టింది. బస్సులో ప్రయాణిస్తున్న 25 మంది కార్మికులు గాయాలపాలయ్యారు. వారిని పటాన్‌చెరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిలు గాయపడిన కార్మికులను పరామర్శించారు.

పోగొట్టుకున్న పుస్తెలతాడు అప్పగింత

కోహెడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో బంగారు పుస్తెలతాడు దొరకడంతో డ్రైవర్, కండక్టర్ బుధవారం పుస్తెల తాడుని బాధితురాలికి అప్పగించారు. మంగళవారం రాత్రి డిపోకు బస్సును అప్పగించే సమయంలో డ్రైవర్ ఉల్లి చంద్రమౌళి, కండక్టర్ కరుణలు బస్సులో ఒక చిన్నపాటి పెట్టెను గమనించారు. దాన్ని తెరిచి పరిశీలించగా అందులో సుమారు రెండు తులాల బంగారు పుస్తెలతాడు కనిపించింది. ఈ పుస్తెలతాడును ఆర్టీసీ డిపో మేనేజర్ బి వెంకటేశ్వర్‌కు అప్పగించారు. బస్సు నడిచే గ్రామాల్లో పోయిన బంగారం ఆర్టీసీ డిపోలో ఉందని ప్రచారం చేశారు. వింజపల్లికి చెందిన బద్దం కమలవ్వకు చెందిన బంగారు ఆభరణాలని తెలిసింది. దీంతో బుధవారం బాధితురాలిని హుస్నాబాద్ డిపోకు పిలిపించి అధికారుల సమక్షంలో బంగారు గొలుసు అప్పగించారు.

ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయానికి ..

తాళం వేసిన బాధితుడు



తాళం వేయబడ్డ ముత్తూట్ ఫైనాన్స్ ద్వారం

పటాన్‌చెరు రూరల్, డిసెంబర్ 10(ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు రూరల్ పరిధి ఇస్నాపూర్ ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయానికి బుధవారం బాధితులు తాళం వేసిన సంఘటన కలకలం రేపింది. ముత్తంగి గ్రామానికి చెందిన సాయి జీవన్‌కుమార్ ఇటీవల ముత్తూట్ ఫైనాన్స్‌లో బంగారం తాకట్టు పెట్టి రూ. 9.51 లక్షలు రుణం తీసుకున్నాడు. ఈనెల 8న బాకీ మొత్తం చెల్లించడానికి ముత్తూట్ ఫైనాన్స్‌కు వెళ్లి మేనేజర్‌తో మాట్లాడి, ఆయన సలహా మేరకు కంపెనీ అకౌంట్‌కి వడ్డీతో కలిపి మొత్తం డబ్బు ఆర్టీజీఎస్ చేశాడు. కానీ, బాధితుడికి బంగారం తిరిగి ఇవ్వకపోవడంతో పలుమార్లు మేనేజర్‌ను కలిసి విన్నవించినా సరైన సమాధానం లభించలేదు. ఆందోళన చెందిన బాధితుడు బుధవారం ఫైనాన్స్‌కు చేరుకొని ప్రశ్నించగా మేనేజర్ రాలేదని చెప్పారు. సిబ్బందిని అడిగినా, సరైన సమాధానం లేకపోవడంతో తీవ్ర నిరాశ చెందిన బాధితుడు తాను చెల్లించిన డబ్బుకు సరైన సమాధానం కావాలంటూ ఫైనాన్స్ కార్యాలయం ప్రధాన ద్వారానికి తాళం వేశాడు. దీంతో బ్యాంకు సిబ్బంది పటాన్‌చెరు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న వారు తాళం తీయించి సిబ్బందిని బయటకు పంపించారు. ఇంత పెద్ద మొత్తం మేనేజర్ సలహాతో ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీకి ట్రాన్స్‌ఫర్ చేసినా మేనేజర్‌తో పాటు సిబ్బంది కూడా సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రత్యామ్నాయం లేకే ఫైనాన్స్‌కు తాళం వేశానని బాధితుడు విలేకరులకు తెలిపాడు. కార్యాలయంలో మహిళా ఉద్యోగులు కూడా ఉండటం, ఫోటోలు తీస్తున్న మీడియాపై వారు దురుసుగా ప్రవర్తించడంతో పలువురు స్థానికులు సిబ్బందిపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. జరిగిన సంఘటనపై మేనేజర్‌ను వివరణ కోసం ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

ఇసుక టిప్పర్ పట్టివేత

తూప్రాన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన బుధవారం తూప్రాన్‌లో చోటు చేసుకుంది. మెదక్ నుంచి ఇందిరమ్మ ఇళ్లకు సరఫరా చేయాల్సిన ఇసుకను అక్రమంగా దారి మళ్లించి రవాణా చేస్తున్నారు. బుధవారం తూప్రాన్ మండలంలో ఎస్సై శివానందం ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టగా ఇసుక టిప్పర్‌ను పట్టుకున్నారు. ఇసుక రవాణాకు సంబంధించిన సరైన పత్రాలు చూపించకపోవడంతో టిప్పర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పెట్రోల్ బంక్‌పై కేసు

మెదక్ అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇంధన కొలతల్లో తేడాలు ఉండడంతో మెదక్ పట్టణంలోని. శ్రీనివాస పెట్రోల్ బంక్‌పై కేసు నమోదు చేసినట్లు జిల్లా పౌరసరఫరా అధికారి నిత్యానందం తెలిపారు. బుధవారం పట్టణంలోని శ్రీనివాస పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేశారు. ఇంధన కొలతలు, నాణ్యత, ధరల ప్రదర్శన, భద్రతా ప్రమాణాలు, వినియోగదారులకు కల్పించాల్సిన కనీక వసతులను పరిశీలించారు. తనిఖీలో ఇంధన కొలతల్లో తేడాలు, ఫిల్టర్ పేపర్ టెస్ట్‌లో అనుమానాస్పద ఫలితాలు వచ్చాయి. టాయిలెట్స్, ఫస్ట్ ఎయిడ్, టైర్లకు ఉచిత గాలి వంటి సదుపాయాలు కనిపించలేదు. దీంతో బంకుపై కేసు నమోదు చేశారు. వినియోగదారులను మోసం చేసినా, నిబంధనలు ఉల్లంఘించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బంక్ వారిని సంబంధింత చట్టాల కింద వివరణ కోరామని, అవసరమైతే బంక్‌ను సీజ్ చేస్తామని నిత్యానందం వెల్లడించారు

గ్రామాలు మూరెడు... అభ్యర్థులు బారెడు..



● వందల్లోనే ఓటర్లు

నారాయణఖేడ్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ డివిజన్‌లో గతంలో ఎప్పుడు లేని విధంగా గ్రామపంచాయతీ ఎన్నికల్లో తీవ్రమైన పోటీ నెలకొంది. వెయ్యిలోపు ఓటర్లు ఉన్న పంచాయతీల్లో కూడా 8 మంది వరకు అభ్యర్థులు పోటీపడుతున్నారు. నిజాంపేట మండలం కల్వలోని కుంటతండాలో 287 మంది ఓటర్లకు 4 అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఈదుల్‌తండాలో 687 మంది ఓటర్లు ఉంటే, 7 అభ్యర్థులు బరిలో ఉన్నారు. నారాయణఖేడ్ మండలం చాప్టా.కె గ్రామపంచాయతీ ఎస్సీలకు రిజర్వు కావడంతో 2110 ఓటర్లు ఉండగా 8 మంది అభ్యర్థులు, అబ్బెందలో 2343 మంది ఓటర్లకు గాను 5 మంది, లింగాపూర్‌లో 1958 మంది ఓటర్లకు నలుగురు, పిప్రిలో 834 మంది ఓటర్లకు 5 మంది, పగిడిపల్లిలో 1072 మంది ఓటర్లకు నలుగురు, రుద్రార్‌లో 1319 మంది ఓటర్లకు నలుగురు, సంజీవన్‌రావుపేటలో 2585 ఓటర్లకు నలుగరు, తుర్కపల్లి తండాలో 668 మంది ఓటర్లకు నలుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మండలకేంద్రమైన నాగల్‌గిద్దలో 9 మంది పోటీ పడుతుండగా, మనూరు మండలం బోరంచలో 7 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

50 శాతం గిరిజన తండాలు ఏకగ్రీవం...

నారాయణఖేడ్ నియోజకవర్గంలో 50 శాతం గిరిజన తండా పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. 8 మండలాల్లో 52 గిరిజన తండా పంచాయతీలున్నాయి. నియోజకవర్గంలో మొత్తం 29 గ్రామపంచాయతీలు ఏకగ్రీవంగా అందులో 26 గిరిజన తండా పంచాయతీలే ఉండడం గమనార్హం. నారాయణఖేడ్‌లో 7, సిర్గాపూర్‌లో 7, కల్హేర్‌లో 1, కంగ్టిలో 2, నాగల్‌గిద్దలో 3, నిజాంపేటలో 3, పెద్దశంకరంపేటలో 3 గిరిజన తండా పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. పెద్దశంకరంపేటలో 2, నాగల్‌గిద్ద మండలంలో ఒకటి గిరిజనేతర పంచాయతీలు ఏకగ్రీవంగా కాగా, మనూరులో మండలంలో అసలు ఏకగ్రీవాల జాడే లేదు.

తలరాతలు మార్చనున్న తిరుగుబాటు అభ్యర్థులు

ఖేడ్ డివిజన్‌లో ఏకగ్రీవ పోను 172 పంచాయతీలకు ఎన్నికలు జరుగనున్నాయి. అనేక గ్రామాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులకు తిరుగుబాటు అభ్యర్థుల పోరు తప్పడం లేదు. పలు గ్రామాల్లో కాంగ్రెస్ మద్దతు అభ్యర్థులు ఇరువురు చొప్పున పోటీలో ఉండగా, కొన్ని చోట్ల బీఆర్ఎస్‌కు మద్దతు అభ్యర్థులే పోటీలో ఉన్నారు. వీరికి తోడు బీజేపీ మద్దతు అభ్యర్థులు కూడా పోటీలో ఉండడంతో గెలుపొందే స్థితిలో ఉన్న వారి ఓట్లను తిరుగుబాటు అభ్యర్థులు, ఇతర పార్టీల అభ్యర్థులు చీల్చే పరిస్థితి ఉన్నది. ఈ నేపథ్యంలో వారి తలరాతలు మారనున్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. కొన్ని గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఓడగొట్టడం కోసం ప్రతిపక్షాల వారంతా జతకట్టడం, మరికొన్ని చోట్ల కాంగ్రెస్ వారితో ఆ పార్టీ వారే పోటీలో ఉండడంతో ఇతర పార్టీల వారు ఇరువైపులా వారికి మద్ధతునివ్వడం వంటి పరిస్థితులు నెలకొన్నాయి.

1242 వార్డులకు బరిలో 2829 మంది..

నారాయణఖేడ్ డివిజన్‌లో 196 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇందులో 1628 వార్డులు ఉండగా, 386 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 1242 వార్డులకు 2829 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.



చర్లపల్లిలో ప్రమాణస్వీకరం చేస్తున్న నూతన పాలకవర్గం

ఏకగ్రీవ సర్పంచ్‌ల ప్రమాణ స్వీకారం

వెల్దుర్తి, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి) : మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవమైన అభ్యర్థులకు బుధవారం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ మేరకు వెల్దుర్తి మండలంలోని చర్లపల్లి సర్పంచ్‌గా అరుణ, బస్వాపూర్ సర్పంచ్‌గా నజ్మాసుల్తానా, శంశిరెడ్డిపల్లి సర్పంచ్‌గా గణేష్, వార్డు సభ్యులు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రమాణ స్వీకారం చేశారు. మంగళపర్తి సర్పంచ్‌గా సంధ్య, 7, 10 వార్డుల సభ్యులు మాత్రమే ఏకగ్రీవం కావడంతో వారికి కేవలం ధ్రువీకరణ పత్రాలు మాత్రమే అందజేశారు.

సరాఫ్‌పల్లి సర్పంచ్‌గా రామచంద్రారెడ్డి

పుల్‌కల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సరాఫ్‌పల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా నందికంటి రామచంద్రారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం ఆయనకు అధికారులు ధృవపత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ మద్దతుతో నామినేషన్ దాఖలు చేసిన రామచంద్రారెడ్డి మినహా అందరూ తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో ఆయన ఏకగ్రీవానికి లైన్ క్లియర్ అయ్యింది. ఇక్కడ మూడు వార్డులు ఏకగ్రీవం కాగా, మరో ఐదు వార్డులకు ఈ నెల 14న పోలింగ్ జరుగనున్నది. కార్యక్రమంలో ఎంపీడీవో కె.శంకర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి సంగమేశ్వర్, ఎంపీపీ మాజీ అధ్యక్షుడు భూంరెడ్డి సుభాష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓడి పోనీయకు నీ ఓటును..



● ఓటు హక్కుపై పాటతో అవగాహన

కొండపాక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిది. ఓటును సద్వినియోగం చేసుకొని సరైన నాయకున్ని ఎన్నుకోవడం కోసం 18 సంవత్సరాల నిండిన వారికి ఓటు హక్కును రాజ్యాంగం కల్పించింది. ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలని వివిధ రూపాల్లో ప్రజలకు చైతన్యం కల్పిస్తున్నారు. విద్యాశాఖలో ఓ ఉన్నతాధికారి రచించి పాడిన పాట ఓటర్లను చైతన్యపరిచేలా ఉంది. గతంలో ఉమ్మడి మెదక్ జిల్లా విద్యాశాఖ అధికారిగా పనిచేసిన గాజర్ల రమేష్ ప్రస్తుతం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌లో డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన పలు సామాజిక అంశాలపై పాటలు రాసి గానం చేసి చైతన్య పరుస్తున్నాడు. అందులో భాగంగా ఓటు హక్కుపై ఇటీవల రాసి గానం చేసిన పాటను విడుదల చేశారు. 'ఓడిపోనియ్యకు నీ ఓటు'ను అంటూ పాడిన పాట ఓటర్లను చైతన్యపరిచేలా ఉంది. ఈ పాటను పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు పిల్లలచే నృత్యం చేయిస్తూ రికార్డు చేసి ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. గతంలోనూ హరితహారం మొక్కల పెంపకంపై రచించి పాడిన పాట ఎంతో పాపులర్ అయింది. అలాగే అందమైన జీవితం అనే పాట జీవిత సారాన్ని చెబుతూ చైతన్యపరిచేలా పాటను రచించి గానం చేశారు.

నాడు మామ సర్పంచ్.. నేడు అల్లుడు ఎమ్మెల్యే

● మామ గాల్‌రెడ్డి స్ఫూర్తితోనే దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి రాజకీయ అరంగేట్రం

దుబ్బాక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజకీయ సేవలకు ప్రజలు పట్టం కట్టడం, ఆ స్ఫూర్తితోనే తర్వాతి తరం రాజకీయాల్లో రాణించడం అరుదైన విషయం. ఈ కోవకే చెందుతారు దుబ్బాక ప్రస్తుత శాసనసభ్యుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి మామ గాల్‌రెడ్డి. ప్రజలకు చేసిన సేవలే ఆయన అల్లుడిని రెండు పర్యాయాలు ఎంపీగా, తాజాగా ఎమ్మెల్యేగా గెలిపించాయి. మొదటి తరం రాజకీయ నాయకులకు గాల్‌రెడ్డి స్ఫూర్తిగా నిలిచారు.

మామ సర్పంచ్‌గా సేవలు

దుబ్బాక మండలం గంభీర్‌పూర్ గ్రామ పరిధిలోని అప్పటి మదిర గ్రామం పోతారం (ప్రస్తుతం గ్రామ పంచాయతీ) గ్రామానికి చెందిన కొత్త గాల్‌రెడ్డి 1964లో వార్డు సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆ సమయంలో వార్డు సభ్యులే సర్పంచ్‌ను ఎన్నుకునే పద్ధతి ఉండేది. గాల్‌రెడ్డి మంచితనం, రాజకీయాల్లోని చురుకుదనం ఆయనను సర్పంచ్‌గా ఎన్నుకునేలా చేశాయి. ఆ తర్వాత నేరుగా ప్రజలే గ్రామ సర్పంచ్‌గా కూడా ఆయనను ఎన్నుకున్నారు. 1978 వరకు ఆయన రెండు పర్యాయాలు సేవలందించారు. తన పదవీకాలంలో ప్రజలకు సేవ చేయడంతోపాటు, అప్పటి సర్పంచులైన ఐరేని లింగయ్య, సోలిపేట రామచంద్రారెడ్డి, చెరుకు ముత్యంరెడ్డిలతో కలిసి పనిచేశారు. కాంగ్రెస్ పార్టీ తరఫున పనిచేస్తూ, అప్పటి మూడు మండలాలతో కలిపి ఉన్న దుబ్బాక బ్లాక్ సర్పంచుల ఫోరంలో కీలకపాత్ర వహించి, ప్రజలకు సేవ చేశారు.రాజకీయ కుటుంబ నేపథ్యం ఉన్న గాల్‌రెడ్డి, తన సోదరి కుమారుడైన కొత్త ప్రభాకర్‌రెడ్డి పోతారంలోనే జన్మించారు. ప్రభాకర్‌రెడ్డి పుట్టిన తర్వాత గాల్ రెడ్డికి అన్నీ విధాలుగా కలిసిరావడంతో, ప్రభాకర్‌రెడ్డిని తన వద్దనే ఉంచుకుని పెంచారు. ఇక్కడే విద్యాభ్యాసం పూర్తి చేసిన ప్రభాకర్‌రెడ్డిని తన సొంత సంతానంలో ఒక్కరిగానే చూసుకున్నారు. తన రెండవ కూతురు మంజులను ఇచ్చి వివాహం కూడా జరిపించారు. మామ గాల్‌రెడ్డి రాజకీయాలను దగ్గరగా గమనించినా, ప్రభాకర్‌రెడ్డి మొదట్లో రాజకీయాలకు దూరంగా ఉండి వ్యాపార మార్గాన్ని ఎంచుకున్నారు. ట్రాన్స్‌పోర్టు కంపెనీకి అధిపత్యం వహించిన ఆయన, 2008లో కేపీఆర్ ట్రస్టు ద్వారా ప్రజా సేవలకు శ్రీకారం చుట్టారు. అదే విధంగా 2011లో తెలంగాణ ఉద్యమంలో చురుకైన భాగస్వామిగా మారి, అప్పటి టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్) పార్టీలో చేరారు. 2014లో మెదక్ పార్లమెంటుకు కేసీఆర్ రాజీనామా చేయడంతో జరిగిన ఉప ఎన్నికల్లో ఎంపీగా గెలుపొందారు. 2019లో తిరిగి భారీ మెజార్టీతో పార్లమెంటు సభ్యుడిగా గెలిచిన ప్రభాకర్‌రెడ్డి, 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ విధంగా ఆయన అనూహ్యంగా మామ రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకున్నారు.



ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

బాండ్ పేపర్ పై హామీలతో ప్రచారం



చేగుంట, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): 17 హామీలతో బాండ్‌పేపర్‌పై రాసి వాటిని అమలు చేస్తానని ప్రమాణం చేస్తూ ఇంటింటా వినూత్న రీతిలో ప్రచారం చేస్తున్నాడో అభ్యర్థి. మెదక్ జిల్లా నార్సింగ్ మండలం సంకాపూర్ తండాలో ఎస్టీ జనరల్ కావడంతో సర్పంచ్ బరిలో నలుగురు అభ్యర్థులు ఉన్నారు. ఓ అభ్యర్థి బుధవారం తండాలోని సమస్యలను బాండ్ పేపర్ పై రాసి ప్రచారం చేశాడు. తండాలోని సేవాలాల్ గుడి నిర్మాణం, ప్రతి ఇంటి ఆడబిడ్డ పెళ్లికి పుస్తె మట్టెలు, రూ.11 వేలు, ఎవరూ లేని నిరుపేదలకు చనిపోతే దహన సంస్కారాలు, గ్రామ పంచాయతీ భవనం కోసం సొంత డబ్బులతో స్థల సేకరణ వంటి 17 హామీలను బాండ్ పేపర్‌పై రాసి ప్రచారం చేశారు.

ఓటర్లను మభ్యపెడుతున్నాడంటూ అభ్యర్థిపై ఫిర్యాదు..

నారాయణఖేడ్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఓటర్లను ప్రభావితం చేస్తున్నాడంటూ ఓ అభ్యర్థిపై స్థానికులు అధికారికి ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కల్హేర్ మండల పరిధిలోని జమ్లాతండా పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి కడావత్ గోవింద్ ఇంటింటికీ డబ్బులు పంచుతాను, మద్యం పోస్తాను నాకు మాత్రమే ఓట్లు వేయాలని ఓటర్లను మభ్య పెడుతున్నాడని తండావాసులు ఆరోపించారు. అంతేకాకుండా తనకు ఓటు వేయకపోతే కొట్టించి ఇంట్లో కూర్చోబెడతామని బెదిరిస్తున్నాడని.. విచారణ చేసి అతడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు బుధవారం ఖేడ్‌లో సబ్ కలెక్టర్ ఉమా హారతికి కలిసి ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని సబ్ కలెక్టర్ హామినిచ్చారు.

ఏకగ్రీవమైన జీపీల్లో ఉపసర్పంచ్‌ల ఎన్నిక

అక్కన్నపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏకగ్రీవమైన ఆరు గ్రామ పంచాయతీలకు బుధవారం అధికారులు ఉపసర్పంచ్‌ల ఎన్నిక నిర్వహించారు. కొప్పెన్‌చౌడుతండా ఉపసర్పంచ్‌గా గుగులోతు అర్జున్, గొల్లపల్లి ఉపసర్పంచ్‌గా బంక శ్రీను, శ్రీరామ్‌తండా ఉపసర్పంచ్‌గా భూక్య రాజు, కుందనవానిపల్లి ఉపసర్పంచ్‌గా గుండబోయిన సమత, దాసుతండా ఉపసర్పంచ్‌గా గుగులోతు రాజు, దుబ్బతండా ఉపసర్పంచ్‌గా మాలోతు సార్వన్ ఎన్నికైనట్లు ఎంపీడీవో బానోతు జయరాం తెలిపారు.

ఐఐటీహెచ్‌తో ఇటలీ సాంకేతిక భాగస్వామ్యం

● స్థిరమైన డిజైన్లు, ఆవిష్కరణల నైపుణ్యతే లక్ష్యం

● జనవరి 15 నుంచి సంయుక్త ఆన్‌లైన్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం



ఒప్పందం పత్రాలను చూపుతున్న ఐఐటీహెచ్, ఇటలీ మిలన్ సంస్థ ప్రతనిధులు

కంది, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్థిరమైన డిజైన్లు, ఆవిష్కరణల నైపుణ్యతే లక్ష్యంగా సంగారెడ్డి జిల్లా కందిపరిధిలోని ఐఐటీ హైదరాబాద్ పోలీ డిజైన్, ఇటలీ మిలన్ సంస్థల మధ్య సాంకేతిక భాగస్వామ్యం కుదిరింది. ఈ మేరకు ఇరు సంస్థల ప్రతినిధులు బుధవారం ఐఐటీహెచ్‌లో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఇందుకోసం ఐఐటీహెచ్‌లోని పోలి డిజైన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జనవరి 15 నుంచి సంయుక్త ఆన్‌లైన్ సర్టిఫికేషన్ ప్రోగ్రాంను ప్రారంబిచనున్నారు. 54 గంటలపాలు అధ్యాపకులు ఆన్‌లైన్ ద్వారా ఆచరణాత్మక డిజైన్ వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉద్భవిస్తున్న డిజైనర్లు, ఆవిష్కర్తలను, స్థిరమైన డిజైన్ పద్ధతులు, ఉత్పత్తిసేవా ఇంటిగ్రేషన్ నైపుణ్యాలు, ప్రపంచ సహకార అనుభవంతో సన్నద్ధం చేయడానికి ఈ సర్టిఫికెట్ కోర్సు రూపొందించబడింది. ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ ఈ భాగస్వామ్యంతో ఇంటిగ్రేటెడ్ ప్రొడక్ట్ సర్వీస్ సిస్టమ్ డిజైన్‌పై ఒక ప్రత్యేకమైన సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు.ఇటలీతో బలమైన ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించే ప్రపంచ జ్ఞాన భాగస్వామ్య నమూనాకు ఇది ఒక ప్రధాన ప్రోత్సాహకంగా ఉంటుందని ఆకాంక్షించారు. భారతదేశం జనాభా డివిడెండ్‌ను ఉపయోగించుకోవడానికి బలమైన సేవా ఆధారిత పర్యావరణ వ్యవస్థలో రాణించడానికి సిద్ధంగా ఉందన్నారు. వికసిత్ భారత్ కోసం నైపుణ్యం కలిగిన సమర్థులైన మానవ వనరులను నిర్మించడంలో ఈ చొరవ చాలా దూరం వెళ్తుందని నేను ఆశిస్తున్నానని ఆయన వెల్లడించారు.



బరిలో వదినామరదళ్లు.. అన్నదమ్ములు



ముడవత్ మణెమ్మ, మాలోతు రాజమ్మ

అక్కన్నపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అక్కన్నపేట మండలం మసిరెడ్డి తండాలో సర్పంచ్ పదవి కోసం సొంత వదిన-మరదలు పోటీ పడుతున్నారు. తండాకు చెందిన మాలోతు హరిలాల్ తన సొంత చెల్లెలు మణెమ్మను ఇదే తండాకు చెందిన ముడవత్ మోహన్‌తో వివాహం జరిపించారు. సర్పంచ్ పదవి కోసం హరిలాల్ భార్య రాజమ్మ, మణెమ్మ ఇద్దరు నామినేషన్‌లు దాఖలు చేశారు. ఎవరూ నామినేషన్‌లు విత్‌డ్రా చేసుకోకపోవడంతో వదిన-మరదలు పోటీలో నిలిచారు. వీరితోపాటు మరో ఇద్దరూ కూడా పోటీలో ఉన్నారు. వీరిలో గెలుపు ఎవరిని వరిస్తుందో అని తండావాసులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

సొంత అన్నదమ్ముల మధ్య పోటీ



గోవిందు రమేష్, గోవిందు సురేష్

కోహెడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కోహెడలో రెండవ వార్డులో ఇద్దరు అన్నదమ్ములు బరిలో నిలిచారు. ఈ వార్డు బీసీ జనరల్ కావడంతో మొత్తం ఆరుగురు అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. ఇందులో కాంగ్రెస్ మద్దతు అభ్యర్థిగా గోవిందు రమేష్, స్వతంత్ర అభ్యర్థిగా గోవిందు సురేష్ పోటీలో ఉన్నారు. వీరిద్దరు సొంత అన్నదమ్ములు కావడం విశేషం.

సర్పంచ్ అభ్యర్థికి నీ ఇష్టం కానీ...

నాకైతే ఓటేయండి..!


● వార్డు ప్యానల్ ప్రచారంలో వింత ధోరణి..

● సర్పంచు అభ్యర్థుల డబ్బులతోనే..




దుబ్బాక, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): ఏ సర్పంచును తట్టినా... ఎదో తలనొప్పి వలపోతలు తప్పడంలేదు. ప్రచారం కంటే, తన చుట్టూ జరిగే తతంగంపైనే భయం నెలకొంది. మేము బహుబలిలం.. మా వెనుక కట్టప్పలేవరో..? అంటూ బహిరంగంగానే బాధను వెళ్లకక్కుతున్నారు. దుబ్బాక మండలంలోని 21 గ్రామపంచాయతీలకు రెండు చోట్ల ఏకగ్రీవంగా సర్పంచు ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. మిగితా చోటా అన్నిపార్టీల ప్రతిపాదనతో బరిలో దిగిన సర్పంచులకు వెన్నుపోటు రాజకీయాల ముప్పు తప్పడంలేదు. స్వతంత్ర్య అభ్యర్థులు నేరుగా ప్రచారం జరుపుకుంటున్నప్పటికీ, పార్టీలు ఆయా వార్డుల్లో సర్పంచు అభ్యర్థులతోపాటు వార్డు సభ్యుల ప్యానల్ అభ్యర్థులను బరిలో దింపారు. సర్పంచు అభ్యర్థులు నేరుగా లేదా వార్డు అభ్యర్థులతో కలిసి ప్రచారం చేసినా తలనొప్పిగానే మారింది. ఆయా వార్డులోని ప్రజలకు అందించే సరంజామాను వార్డు అభ్యర్థుల ద్వారానే సమకూర్చుతున్నారు. అయినా పలువురు తమ ప్రచారాన్ని మాత్రమే చేస్తున్నారు. తమ గుర్తును ఓటర్లకు చెప్పి, చాలా చోట్ల సర్పంచు అభ్యర్థికి మీ ఇష్టం వచ్చిన వారికి వేసుకొండని చెబుతున్నారు. ప్యానల్ అభ్యర్థులుగానే ఉంటూ ప్రత్యర్థి సర్పంచు అభ్యర్థుల వద్ద బేరసారాలు సాగిస్తున్న ఉదాంతాలు కొన్ని గ్రామాలల్లో బహిర్గతయ్యాయి. దీంతో కొంతమంది బహిరంగంగానే మా ప్యానల్ కాదనీ, సొంతంగానే ప్రచారం నిర్వహించుకోవాల్సి వస్తుంది. నిత్యం వెలుగు చూస్తున్న సంఘటనలపై ఉదయం ప్రచారానికి వెళ్లేముందు కౌన్సెలింగ్ కూడా చేస్తున్నారు. ఆయా పార్టీల అధిష్టానం,, తమ మద్దతు దారులైన పెద్దల దృష్టికి కూడా తీసుకెళ్తున్నారు. ఒక గ్రామంలో నామమాత్రంగా ప్యానల్‌లో చేరి, సర్పంచు అభ్యర్థి పంపిన మద్యంను మధ్యలోనే మాయం చేసిన సంఘటన ప్రధాన పార్టీ సర్పంచు అభ్యర్థికి ఎదురైంది. ఈ తరుణంలో కట్టప్పలతో ఎక్కడ వెన్నుపోటు పడుతుందోనన్న భయంతో సర్పంచు అభ్యర్థులు ఉన్నారు.

హుగ్గెల్లితండాలో ఈసారే ఎన్నికలు



జహీరాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా హుగ్గెల్లితండాలో ఈసారే ఎన్నికలను నిర్వహిస్తున్నారు. గతంలో ఇక్కడి ఓటర్లు అమ్లేట్ గ్రామమైన హుగ్గెల్లిలో ఓటు వేసేవారు. కేసీఆర్ హయంలో తాండాలను గ్రామపంచాయతీలుగా మార్చిన నేపథ్యంలో ఈ తండాకు గ్రామపంచాయతీ హోదా దక్కింది. 2016లో ఈ తండాలో ఎన్నికలు జరిపేందుకు అధికారులు ఏర్పాట్లు చేయగా గ్రామస్థులంతా ఒక్కటై శెట్టిరాథోడ్‌ను సర్పంచ్‌గా ఏకగ్రీవంగ ఎన్నుకున్నారు. ప్రస్తుతం ఎన్నికలు నిర్వహించడంతో సందడి వాతావరణం ఏర్పడింది. ఇక్కడ 60 ఇళ్లు, 400 మంది జానాభా ఉండగా, 310 మంది ఓటర్లున్నారు.

మీకు తెలుసా..?



మీ ఓటును వేరొకరు వేస్తే..

హుస్నాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నేడు మొదటి విడత ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ నేపథ్యంలో టెండర్డ్ ఓటు అంటే ఏమిటో తెలుసుకుందాం. ఒకరికి బదులు మరొకరు ఓటు వేయు సందర్భాలను అడ్డుకునేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని రకాల చర్యలు చేపట్టింది. అలాంటి సంఘటనలు జరుగకుండా టెండర్డ్ ఓటును ప్రవేశ పెట్టారు. ఏ ఓటరుకైనా తాను వేయడానికి ముందుగానే తన ఓటును మరొకరు వేసి ఉంటే తాను సరైన ఓటరునని తగు ఆధారాలతో నిరూపించుకోవచ్చు. ఆ సందర్భంలో ప్రిసైడింగ్ అధికారి సదరు వ్యక్తులను సరైన వారిగా గుర్తించడానికి వీలుగా అవసరమైన ప్రశ్నలు వేసి జవాబులు రాబడుతారు. అప్పుడు టెండర్డ్ బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేయడానికి అట్టి వారిని అనుమతిస్తారు. ఇందుకోసం ప్రిసైడింగ్ అధికారి టెండర్డ్ ఓటర్ల జాబితా నమూనా 10102లో అవసరమైన నమోదు చేసి ఓటరు సంతాకాన్ని తీసుకుంటారు. బ్యాలెట్ పేపర్ వెనుక భాగాన టెండర్డ్ బ్యాలెట్ పేపర్ అని ముద్రగాని, చేతితో రాసి గాని సదరు ఓటరుకు సరఫరా చేస్తారు. సదరు బ్యాలెట్ పేపరులో రబ్బరు స్టాంపుతో ముద్రవేసి మడత పెట్టి దానిని ప్రిసైడింగ్ అధికారికి అందజేస్తారు. ఆయన దానిని ప్రత్యేకమైన కవరులో భద్రపరుస్తారు. దీన్నే టెండర్డ్ ఓటు అంటారు. అయితే ఏదేని పోలింగ్ స్టేషన్‌లో మొత్తం పోలైన ఓట్లలో 0.1శాతం కన్నా ఎక్కువగా టెండరు ఓట్లు కనుక నమోదైనట్లయితే రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఒక నివేదికను పంపిస్తారు. దీనిపై పూర్తి సమాచారం సేకరించి రీ-పోలింగ్ నిర్వహించేందుకు ఆదేశాలను జారీ చేసే అధికారం రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఉంటుంది.

ఓటును 'ఛాలెంజ్' చేయొచ్చు..

ఎన్నికల్లో అప్పుడప్పుడు గెలుపోటములపై ప్రభావితం చూపే ఛాలెంజ్ ఓటుపై ఇప్పటికీ చాలా మంది ఓటర్లకు అవగాహన ఉండదు. ఛాలెంజ్ ఓటు అంటే ఏమిటి..? దాన్ని ఎలా వినియోగించుకోవాలి..? అనే విషయం తెలుసుకుందాం. గ్రామ పంచాయతీలో ఓటు ఉండి కూడా అనర్హులని పోలింగ్ కేంద్రాల్లో ఉండే ఆయా రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్లు సవాల్ చేసే విధానాన్నే ఛాలెంజ్ ఓటు అని అంటారు. ఓటరు జాబితాలోని పేరు, ఫొటో ఇతర వివరాలు సరిపోలి ఉన్నప్పటికీ ఆ ఓటరు బోగస్ అని ఏజెంట్లు పోలింగ్ అధికారికి ఫిర్యాదు చేస్తారు. పరిశీలించిన పోలింగ్ అధికారి అభ్యంతరం తెలిపిన ఏజెంటు నుంచి రూ.5 తీసుకొని రసీదు ఇస్తారు. ఆ తరువాత పోలింగ్ అధికారికి అందుబాటులో ఉన్న స్థానిక అధికారుల్లో ఒక్కరిని నియమించి ప్రాథమిక విచారణ చేయిస్తారు. అన్ని సరిగా ఉంటే ఓటరుకు ఓటు వేసేందుకు అనుమతి ఇస్తారు. ఏజెంట్ అభ్యంతరం తెలిపిన ఓటరు అందరి లాగే తన ఓటు హక్కును వినియోగించుకుంటారు. ఈ ఓటు సైతం లెక్కలోకి వస్తుంది. దీన్నే ఛాలెంజ్ ఓటు అంటారు. కాగా ప్రాథమిక విచారణలో సదరు ఓటరు బోగస్ అని తేలితే ఏజెంట్ చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వడమే కాకుండా బోగస్ ఓటరుపై క్రిమినల్ కేసు నమోదు చేసే అధికారం పోలింగ్ అధికారికి ఉంటుంది.

సమానంగా ఓట్లు వస్తే..

సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థులకు సమానంగా ఓట్లు వచ్చినట్లయితే లాటరీ ద్వారా అంతిమ ఫలితాన్ని నిర్ణయిస్తారు. ఉదహారణకు ఏదేని గ్రామంలో ఏ, బీ, సీ, డీ అభ్యర్థులు బరిలో ఉంటే ఏ అభ్యర్థికి 701, బీకి 567, సీకి 701, డీ అభ్యర్థికి 460 ఓట్లు వచ్చాయనుకుందాం. ఈ నేపథ్యంలో సమానా ఓట్లు పొందిన ఏ, సీ అభ్యర్థులకు సంబంధించి లాటరీ నిర్వహించి విజేతను నిర్ణయిస్తారు.

న్యూస్ బాక్స్

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కేసులు

కోహీర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని జహీరాబాద్ పట్టణ సీఐ శివలింగం హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా కోహీర్ మండలంలోని ఆయా గ్రామాలను పరిశీలించి మాట్లాడారు. జహీరాబాద్ నియోజకవర్గంలో రెండు, మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్న ఆయా మండలాల్లో నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించొద్దన్నారు. ఆయన వెంట ఎస్ఐ నరేష్ ఉన్నారు.

మద్యం తరలిస్తే...

చిన్నశంకరంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మద్యం అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ప్రభుదాస్ హెచ్చరించారు. చిన్నశంకరంపేట మండలంలోని రెండో దశ స్థానిక ఎన్నికల సందర్భంగా బుధవారం పోలీసులు, రెవెన్యూ అధికారులు వాహనాలను తనిఖీ చేశారు.

బీఆర్ఎస్‌లో చేరిన తాటిపల్లి మాజీ ఉపసర్పంచ్

మునిపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తాటిపల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ మధుకర్ బుధవారం బీఆర్ఎస్ మండల నాయకులు తాటిపల్లి మల్లేశం, బక్కారెడ్డిల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పైతర సాయికుమార్ సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ కండువా వేసి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు తుడుం దుర్గయ్య, కలాల్ అంజయ్యగౌడ్, బుర్ర సురేష్, కాశగడ్డ మల్లేశం, బోయిని మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

నారాయణఖేడ్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పట్టణంలోని రాజీవ్ చౌక్ వద్ద బుధవారం బైక్ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ వైపుగా వెళ్తున్న ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు ఓంప్రకాశ్ గమనించి 108కు సమాచారం అందించారు. అంబులెన్స్ వచ్చాక స్థానికుల సహాయంతో గాయపడిన మహిళను ఖేడ్ వైద్యశాలలో చేర్పించి మానవత్వాన్ని చాటుకున్నారు.

సిద్ధేశ్వర్‌కు ఘన సన్మానం

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎన్నికైన సిద్ధేశ్వర్, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు లక్ష్మిని బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

వరిగడ్డి, కొయ్యలను కాల్చవద్దు

నారాయణఖేడ్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కోతలయ్యాక వరి కొయ్యలు, మిగిలిన గడ్డిని కాల్చకుండా పొలంలోనే కుళ్లింపజేయాలని ఖేడ్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు నూతన్‌కుమార్, పంటల యాజమాన్యం శాస్త్రవేత్త రమేష్ అన్నారు. బుధవారం డీడీఎస్-కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని వెంకటాపూర్ శివారులో రైతు నవీన్ కులకర్ణికి సంబంధించిన మూడెకరాల వ్యవసాయ క్షేత్రంలో పూసాడీకంపోజర్ ద్వారా వరిగడ్డిని కుళ్లింపజేయడంపై క్షేత్ర పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూసాడీకంపోజర్ ఐసీఏఆర్, ఐఏఆర్ఐ అభివృద్ధి చేసిన సూక్ష్మజీవాల ద్రావణమన్నారు. ఇది పంటల అవశేషాలను 25 రోజుల్లో వేగంగా కుళ్లిపోయేలా చేస్తుందన్నారు. వారి వెంట ఆత్మ బీటీఎం మారుతిరెడ్డి, రైతులు ఉన్నారు.

అభ్యర్థులు నిబంధనల మేరకే ఖర్చు చేయాలి

కంగ్టి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీల్లో పోటీ చేస్తున్న సర్పంచులు, వార్డుసభ్యుల అభ్యర్థులు నిబంధనల మేరకే ఎన్నికల ఖర్చులు చేయాలని ఎంపీడీవో సత్తయ్య సూచించారు. బుధవారం మండల కేంద్రమైన కంగ్టిలోని రైతువేదికలో అభ్యర్థులకు ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. నామినేషన్ సమయంలో అభ్యర్థులు సమర్పించిన బ్యాంకు ఖాతా ద్వారానే లావాదేవీలు నిర్వహించాలన్నారు. ఎన్నికల్లో ఖర్చు చేసే ప్రతిపైసాకు లెక్కలు చూయించాల్సి ఉంటుందన్నారు.

పోలీసు, ఎక్సైజ్, ఎఫ్ఎస్ బృందాల తనిఖీలు

రామాయంపేట/నిజాంపేట/నర్సాపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పోలీసు, ఎక్సైజ్, ఫ్లయింగ్ సర్వలెన్స్ బృందాలు బుధవారం చేపట్టిన తనిఖీలు చేపట్టాయి. ఈ తనిఖీల్లో రామాయంపేటలో 480 క్వార్టర్లు, నిజాంపేటలో 50 క్వార్టర్లు పట్టుబడ్డాయి. రామాయంపేట నుంచి దౌల్తాబాద్ వైపు కారులో తరలిస్తున్న మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. అలాగే నర్సాపూర్-వెల్దుర్తి రోడ్డుపై ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి డిప్యూటీ తహసీల్దార్ స్వప్న, ఏఎస్ఐ సుందర్‌రాజుతో వాహనాల తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ఆటోలో తరలిస్తున్న 8 కాటన్లలోని 384 క్వార్టర్ల మద్యం సీసాలను పట్టుకున్నామని ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు.

నిరుపయోగంగా వైకుంఠరథం

● మరమ్మతులకు నోచుకోక మూలకు.. ● మృతదేహాలను తరలింపునకు ఇబ్బందులు

నర్సాపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ పట్టణంలో ఎవరైనా చనిపోతే వారిని శ్మశానవాటికకు తరలించడానికి అజయ్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైకుంఠరథం మున్సిపల్ కార్యాలయంలో పనిచేయకుండా మూలన పడింది. మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్ తన కుమారిడి పేరిట ఏర్పాటు చేసిన అజయ్‌ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా వైకుంఠ రథం గతంలో మున్సిపల్‌కు అందజేశారు. ఆ వైకుంఠరథం ఇన్నాళ్లు పట్టణంలో ఎవరు చనిపోయి ఎంతగానో ఉపయోగకరంగా ఉండేది. కొన్నిరోజులుగా మరమ్మతులు రావడంతో బాగు చేయకపోవడంతో మున్సిపల్ ప్రాంగణంలో మూలన ఉంచారు. దీంతో ఎవరు చనిపోయినా శ్మశానవాటికకు తీసుకెళ్లేందుకు ప్రైవేట్ వాహనాలను తీసుకోవడానికి వ్యయ ప్రయాసలు పడాల్సి వస్తోందని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేద, మధ్య తరగతి వారికి ఎంతో ఉపయోగకరంగా ఉన్న వైకుంఠరథాన్ని అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.



మున్సిపల్ ప్రాంగణంలో మూలన ఉన్న వైకుంఠ రథం

అన్నిరంగాల్లో రాష్ట్రం అభివృద్ధి : రోహిత్‌రావు

మెదక్ కల్చరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బుధవారం మెదక్ మండలం మాచవరం, ర్యాలమడుగుగు, పేరూరు, రాజ్‌పల్లి, మక్తభూపతిపూర్, పాతూర్ తదితర గ్రామాల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించి మాట్లాడారు. అధికారంలో ఉన్న పార్టీకి ఓటేసి గెలిపిస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు బలపరిచిన అభ్యర్థులకు ఓటేసి ఓటు వృథా చేసుకోవద్దన్నారు. డబ్బు, మద్యానికి ఆశపడి పల్లెలు ఆగం చేసుకోవద్దని కోరారు.



మాచవరం గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు, శ్రీనివాస్‌చౌదరి

మానవ హక్కులను ఉల్లంఘిస్తే శిక్ష

● నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి హేమలత

నర్సాపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మానవ హక్కులను ఉల్లంఘిస్తే చట్టరీత్యా శిక్షలు తప్పవని నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి హేమలత హెచ్చరించారు. బుధవారం నర్సాపూర్ కోర్టు ఆవరణలో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే చట్టరీత్యా కఠినంగా శిక్షించబడుతారని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు భారత రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ 18 ఏళ్లలోపు పిల్లలకు వివాహం చేయడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ సుధాకర్, న్యాయవాదులు స్వరూప, మధుశ్రీ, నాగరాజు, సాయిరాం, రవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోనే ప్రజలకు మేలు : హనుమంతరావు

చిన్నశంకరంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ అభ్యర్థులను సర్పంచులుగా గెలిపించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. బుధవారం చిన్నశంకరంపేట మండలంలోని బాగిర్తిపల్లి, కామారం, మిర్జాపల్లి తండాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు అన్ని విధాలుగా మేలు జరుగుతుందన్నారు. సర్పంచ్ అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రమణ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ సర్పంచులు రాజిరెడ్డి, జనార్దన్, ఆయా గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



మిర్జాపల్లితండాలో మాట్లాడుతున్న హనుమంతరావు

శివంపేట ప్రాథమిక పాఠశాలను సందర్శించిన డీఈవో



విద్యార్థులతో పాఠాలు చదివిస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

పుల్‌కల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ మండలం శివంపేటలోని ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల వరండాలో కూర్చున్న విద్యార్థుల వద్దకు వెళ్లి నోట్‌బుక్స్‌ను పరిశీలించి, పాఠాలు చదివించారు. విద్యార్థులు రాయడం, చదవడం బాగా చేస్తున్నారని సంతృప్తిని వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన వసతి, మరుగుదొడ్లు, మూత్రశాలలు, విద్యుత్ తదితర మౌలిక సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు ప్రహరీగోడ లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయంటూ డీఈవోకు వివరించారు.

రెండేళ్లలో గ్రామాలను కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసింది

● మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

నిజాంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ పల్లెలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కేసీఆర్ పదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి పనులే ఇప్పటికీ గ్రామాల్లో కనిపిస్తున్నాయని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించడానికి నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించి మాట్లాడారు. ఆరుగ్యారంటీలు, 420 హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి పంచాయతీ ఎన్నికల్లో కర్రు కాల్చివాత పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, మహిళా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న పద్మారెడ్డి

ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన



పెద్దశంకరంపేటలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ఎల్లయ్య

పెద్దశంకరంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేటలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పంచాయతీ ఎన్నికల ప్రక్రియను మెదక్ జడ్పీ సీఈవో ఎల్లయ్య బుధవారం పరిశీలించారు. జోనల్, రూట్, స్టేజ్ టూ అధికారుల, పీవోలు, ఓపీలతో మాట్లాడుతూ సూచనలు చేశారు.

ఓటింగ్‌కు ఏదైనా గుర్తింపుకార్డు తీసుకెళ్లండి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఓటర్ కార్డులు లేనిపక్షంలో 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదేని ఒకటి తీసుకెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఈ నెల 11, 14, 17 తేదీల్లో మూడు విడతల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లే సమయంలో ఓటరు కార్డు లేనివారు ఇతర 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒక గుర్తింపు కార్డును తీసుకెళ్లి ఓటేయొచ్చని పేర్కొన్నారు. ఓటర్‌కార్డు లేని వారు ఆధార్‌కార్డు, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ జాబ్‌కార్డు, ఫొటోతో కూడిన పోస్టాఫీస్, బ్యాంక్ పాస్ బుక్కు, కార్మిక మంత్రిత్వశాఖ ఇచ్చిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఫొటోతో కూడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కుల ధ్రువీకరణ పత్రాలు, ఇండియన్ పాస్‌పోర్టు, ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంటు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే జారీచేసిన ఉద్యోగ గుర్తింపు కార్డు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఇచ్చిన అధికారిక గుర్తింపుకార్డు, దివ్యాంగుల గుర్తింపుకార్డు, పట్టాదార్ పాస్ పుస్తకం, రేషన్‌కార్డు, ఫొటోతో కూడిన ఆయుధ లైసెన్స్ పత్రం, ఫ్రీడం ఫైటర్ ఐడీకార్డు, ఆర్‌జీఐ ద్వారా జారీచేసిన ఎన్‌పీఆర్ స్మార్ట్‌కార్డు, ఎంపీలకు జారీచేసిన గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తీసుకుని వెళ్లి ఓటర్లు ఎన్నికల అధికారులకు చూపించి ఓటు వేయవచ్చని సూచించారు.

నషాముక్త్ భారత్ ప్రతీ ఒక్కరి కర్తవ్యం కావాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నారాయణఖేడ్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నషాముక్త్ భారత్ ప్రతీ ఒక్కరి కర్తవ్యం కావాలని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు విఠల్, ప్రకాష్, నర్సింహులు, రవీందర్, నషాముక్త్ భారత్ అభియాన్ సమన్వయకర్త ఉమేరా అన్నారు. పీఎంశ్రీ కింద ఎంపికైన ఖేడ్ జడ్పీహెచ్ఎస్‌లో బుధవారం విద్యాశాఖ, మహిళా, శిశుసంక్షేమ శాఖల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. బాలల హక్కులు, చట్టాలు, పిల్లల రక్షణ, భద్రత, బాల కార్మికుల నిర్మూలన, ఫైర్ సేఫ్టీ, విపత్తుల నుంచి జాగ్రత్తలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలికాలంలో ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

● సంగారెడ్డి డీఎంహెచ్‌వో డా.వసంతరావు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తీవ్ర చలి ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యశాఖ సూచనలు పాటించాలని సంగారెడ్డి డీఎంహెచ్‌వో డా.ఎం. వసంతరావు సూచించారు. ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతున్నందున పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, ఆస్తమా, బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక రోగులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చలిలో బయటకు వెళ్లేటప్పుడు శరీరాన్ని కప్పుకునే వెచ్చని వులెన్ దుస్తులు ధరించాలని సూచించారు. చల్లని పానీయాలు, బయటి ఆహారం ఎక్కువగా తీసుకోకపోవడం మంచిదన్నారు. జలుబు, దగ్గు, శ్వాసకోశ సమస్యలు, తలనొప్పి, అలసట లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. చలి తీవ్రత పెరుగుతున్న తరుణంలో అనవసర ప్రయాణాలు చేయరాదని, ముఖ్యంగా ఉదయం 5 నుంచి రాత్రి 8 గంటల మధ్య, అదేవిధంగా రాత్రి 9 గంటల తర్వాత బయటకు వెళ్లకపోవడం మంచిదన్నారు. జిల్లా ప్రజలు ఆరోగ్య శాఖ సూచనలు పాటిస్తూ ఆరోగ్య భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

వార్డుల విభజనలో లోపించిన శాస్త్రీయత

అమీన్‌పూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీహెచ్ఎంసీ వార్డుల విభజనలో శాస్త్రీయత లోపించిందని పలు పార్టీల నాయకులు విమర్శించారు. పాలన వికేంద్రీకరణ కోసం శాస్త్రీయంగా విభజించాల్సి ఉండగా ఏ ప్రాతిపదికన అధికారులు డివిజన్లను ఏర్పాటు చేశారని ప్రశ్నిస్తున్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎడ్ల రమేష్, నాయకులు ఆదెల్లి రవీందర్ మాట్లాడుతూ ఓటర్లు ఎక్కువగా కేంద్రీకృతమై ఉన్న బీరంగూడ పేరుమీద డివిజన్ ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. అధికార పార్టీ నాయకులు కనుసన్నల్లో డివిజన్ల ఏర్పాటు చేసినట్లు కనిపిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ అమీన్‌పూర్ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ లక్ష ఓటర్లు ఉన్న అమీన్‌పూర్‌లో కనీసం మూడు డివిజన్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎక్కువ జనావాసాలు, ఓటర్లు ఉన్న బీరంగూడ కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేయాలన్నారు. అమీన్‌పూర్, బీరంగూడ గ్రామాలను రెండుగా చీల్చి డివిజన్లను ఏర్పాటు చేయడం వల్ల ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. తమ అభ్యంతరాలను జీహెచ్ఎంసీ అధికారులకు తెలియజేస్తామన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ఓటర్ల ప్రతిజ్ఞ

పెద్దశంకరంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నేడు గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పెద్దశంకరంపేటలోని గాంధీచౌక్ వద్ద బుధవారం మోడల్ స్కూల్ విద్యార్థులు ఓటర్ల ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ కోఆర్డినేటర్ భారతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ

● డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ఎలక్షన్ కమిషన్‌తో కలిసి ఓటు చోరీకి పాల్పడడాన్ని నిరసిస్తూ అధిష్ఠానం ఆదేశాల మేరకు మెదక్ జిల్లాలో 65 వేల సంతకాలు సేకరించినట్లు కాంగ్రెస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ పేర్కొన్నారు. జిల్లాలో సేకరించిన సంతకాలను నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డితో కలిసి హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పీసీసీ ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్‌కు అప్పగించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత రాజ్యాంగం వర్ధిల్లాలి అంటే.. ఓటు ఎంతో విలువైందని, ఆ ఓటును బీజేపీ పార్టీ అధికారంలోకి రావడానికి దొంగ ఓట్లుగా మలుచుకుంటుందని ఆరోపించారు.



గాంధీభవన్‌లో సేకరించిన సంతకాలను అప్పగిస్తున్న ఆంజనేయులుగౌడ్, రాజిరెడ్డి

ఘనంగా పండుగ సాయన్న వర్ధంతి

జహీరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీనవర్గాల హక్కుల కోసం, నిజాం నిరంకుశ పాలనపై, జమిందారి వ్యవస్థపై పోరాడిన బహుజన వీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ అని పలువురు పేర్కొన్నారు. బుధవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జహీరాబాద్‌లో సాయన్న వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండాపురం నర్సింలు పాల్గొన్నారు.

విజేతలెవరో..?

(5వ పేజీ తరువాయి)

జరిగేలా చూసుకున్నారు. చివరి రోజు భారీగా నగదు పంపిణీ చేసినట్లు సమాచారం. వెండి ఆభరణాలు, చీరలు సైతం పంపిణీ చేసినట్లు చర్చ జరుగుతున్నది. రియల్ ఎస్టేట్ కారణంగా ఆదాయ వనరులున్న ఈ గ్రామాలను దక్కించుకోవడానికి ఒక్కో అభ్యర్థి రూ. 2కోట్ల పైగానే ఖర్చు చేస్తున్నట్లు సమాచారం.

నేతలకు ప్రతిష్ఠాత్మకం

తొలి విడత ఎన్నికలపై బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ముఖ్య నేతలు బహిరంగంగా ప్రచారం చేయనప్పటికీ అభ్యర్థుల ఎంపికలో జాగ్రత్తపడ్డారు. సిద్దిపేట జిల్లాలోని వర్గల్‌లో అభ్యర్థి గెలుపు కోసం మాజీ ఎమ్మెల్యే, గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి నర్సారెడ్డి, ఆయన కూతురు డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి శ్రమిస్తున్నారు. మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి స్వగ్రామమైన జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్‌లోనూ ఆయన తమ అభ్యర్థి గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తమ అభ్యర్థుల ప్రచారంపై నిఘా పెట్టారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన పలువురిని సస్పెండ్ చేశారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కూడా తమ అభ్యర్థుల గెలుపు కోసం సూచనలు చేస్తున్నారు. పెద్దశంకరంపేట గ్రామంలో ఎంపీ సురేశ్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డిలు తమ వర్గాల అభ్యర్థులకు మద్దతు ఇస్తుండగా. బీఆర్ఎస్ అభ్యర్థి కోసం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు. టేక్మాల్, రేగోడ్, అల్లాదుర్గం మండలాల్లో తమ అభ్యర్థుల గెలుపు కోసం మంత్రి దామోదర్ రాజనర్సింహ, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు.

చలి @ 5.6 డిగ్రీలు

(5వ పేజీ తరువాయి)

బుజరంపేట 8.8, వాడి 8.8, నర్లాపూర్ 9.0, నాగపూర్ 9.1, శంకరంపేట(ఎ) 9.2, చిట్యాల 9.4, మిన్పూర్ 9.5, బోడగట్ 9.5, మాసాయిపేట 9.6, లింగాయపల్లి 9.8, రాజ్‌పల్లి 9.9, కౌడిపల్లి, టేక్మాల్ 10, శంకరంపేట (ఆర్) 10.2, దొంగల ధర్మారం 10.3, ఇస్లాంపూర్ 10.3, కాగజ్‌మద్దూరు 10.4, పాతూరు 10.6, శివనూరు 10.6, అల్లాదుర్గం 10.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

స్థానిక ఎన్నికల్లో ఒక విడత మినహాయింపు ఇవ్వండి



జానకీరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో మూడు విడతల్లో డ్యూటీలు పడినవారికి ఒక విడత మినహా ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. బుధవారం సంగారెడ్డిలో ఇన్‌చార్జి డీపీవో జానకీరెడ్డికి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. మూడు విడతలు డ్యూటీ కేటాయించిన వారికి మూడోవిడత మినహాయించి, అసలే డ్యూటీ పడని వారికి, ఒక ఫేస్ మాత్రమే పడ్డవారికి డ్యూటీ కేటాయించాలన్నారు. సానుకూలంగా స్పందించిన జానకీరెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రాఈవీణ్య దృష్టికి తీసుకువెళ్లి సవరించే ప్రయత్నం చేస్తానని హామీఇచ్చినట్లు సాయిలు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి శ్రీనివాస్‌రావు, జిల్లా కమిటీ సభ్యురాలు సుచరిత తదితరులు ఉన్నారు.

సమ్మిట్‌తో 5 లక్షల మందికి ఉద్యోగాలు

పటాన్‌చెరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమంతో 5 లక్షల 75 వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో 5 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరు పట్టణంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో బర్రెలు, గొర్రెలు, చేపలు అంటూ గ్రామీణులను స్కాం చేసి కోట్లు దోచుకున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, మతిన్, రవి, సాయిలు, ఈశ్వర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పిప్పడ్‌పల్లి ఎన్నిక యథావిధి

రాయికోడ్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పిప్పడ్‌పల్లి సర్పంచ్ అభ్యర్థి చాల్కి రాజు ఈ నెల 8న శంషోద్దీన్‌పూర్ గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. అయితే ఈ గ్రామపంచాయతీకి సంబంధించి ఎన్నిక జరుగుతుందా..? లేదా..? అనే విషయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. ఇప్పటివరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి నిలిపివేయాలని ఆదేశాల రాలేదని ఎంపీడీవో ఎంఎం.షరీఫ్ తెలిపారు. పిప్పడ్ గ్రామపంచాయతీ ఎన్నిక మాత్రం యధావిధిగా కొనసాగుతుందన్నారు. ఈ పంచాయతీకి సంబంధించి ఇద్దరు సర్పంచ్ అభ్యర్థులు ఉన్నట్లు తెలిపారు.

ఇంద్రేశంలో అక్రమ నిర్మాణాలు కూల్చివేత



అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తున్న అధికారులు

పటాన్‌చెరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రేశం పురపాలక పరిధి పట్టణంలోని అనుమతుల్లేకుండా జరుగుతున్న అక్రమ నిర్మాణాలు బుధవారం కూల్చివేశారు. కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏడు రకాల బహుళ అంతస్థుల నిర్మాణాలపై దృష్టి సారించారు. అనుమతి పత్రాలు చూపించడానికి నిర్మాణదారులు ఆసక్తి చూపలేదు. దీనిపై తక్షణం కూల్చివేయడానికి పూనుకున్నారు. ఎక్స్‌కవేటర్ సహాయంతో కూల్చేశారు. అనంతరం కమిషనర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ అనుతుల్లేకుండా నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేదిలేదని చెప్పారు.

దోమడుగు ప్రజల పోరాటం న్యాయబద్ధమైనది

గుమ్మడిదల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు గ్రామంలో ఉన్న నల్లకుంట చెరువులో పరిశ్రమల వల్ల జరుగుతున్న కాలుష్యం గ్రామస్థుల జీవితాలను అస్తవ్యస్తం చేస్తోంది. చెరువు జలాలు పూర్తిగా కలుషితమై, కళ్లకు కట్టినట్టుగా దుర్వాసన వెదజల్లుతున్న పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంత ప్రజలు సాగునీటి కొరతతో పాటు ఆరోగ్య సమస్యలతో తీవ్రంగా నష్టపోతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం కాలుష్య నియంత్రణ కమిటీ సభ్యుడు, పీసీబీ మెంబర్ సత్యనారాయణరెడ్డి దోమడుగు గ్రామాన్ని సందర్శించి నల్లకుంట చెరువులోని కలుషిత జలాలను ప్రత్యక్షంగా పరిశీలించి మాట్లాడారు. కాలుష్య కారక పరిశ్రమలపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.